# శ్రీ కల్వకుంట చంద్రశేఖర్ రావు

శ్రీ కల్వకుంట చంద్రశేఖర్‌రావు పదకొండవ శాసనసభ (1999-2003) డెప్యూటీ స్పీకర్‌గా 1999, నవంబరు 17న ఏకగ్రీవంగా ఎన్నికై 2001, మే 1 వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు మెదక్‌జిల్లా సిద్ధిపేటలో 1954, ఏప్రిల్ 3న జన్మించారు. ప్రాధమిక విద్యను సిద్ధిపేటలోను, బి.ఎ. (లిటరేచర్) సిద్ధిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివినారు.

శ్రీ చంద్రశేఖర్‌రావు వరుసగా 1985, 1989, 1994, 1999, 2004 సంవత్సరములలో జరిగిన ఎన్నికలలో మెదక్‌జిల్లా సిద్ధిపేట నియోజకవర్గం నుండి శాసన సభకు ఎన్నికైనారు.

వీరు 1989వ సంవత్సరములో రాయలసీమ జిల్లాలలో అక్రమ ఆయుధాలను, బాంబులను వెలికితీయడానికై నిర్వహించిన దాడులలో అక్రమంగా ప్రజలను పోలీసులు వేధించడంపై ఏర్పాటుచేసిన శాసనసభా కమిటీకి అధ్యక్షులుగా ఉన్నారు.

శ్రీ చంద్రశేఖర్‌రావు 1995-1996 సంవత్సరాలలో ప్రభుత్వ సంస్థల కమిటీ అధ్యక్షులుగా ఉన్నారు. అనంతరం వీరు శ్రీ చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో 1996, డిసెంబరు 19 నుండి 1999, అక్టోబరు 11 వరకు రవాణాశాఖ మంత్రిగా పనిచేసినారు.

వీరు 2001 మే 1న శాసనసభ డెప్యూటీ స్పీకర్ పదవికి, శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి, తిరిగి వీరు సిద్ధిపేట అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలలో 2001, సెప్టెంబర్ 22న శాసనసభకు ఎన్నికైనారు.

వీరు 2004వ సంవత్సరంలో లో జరిగిన ఎన్నికలలో సిద్ధిపేట నియోజకవర్గం నుండి రాష్ట్రశాసనసభకు మరియు కరీంనగర్ పార్లమెంటరీ నియోజక వర్గం నుండి లోక్‌సభకు ఎన్నికైనారు. రాష్ట్ర శాసనసభ సభ్యత్వాన్ని వదులుకొని ప్రస్తుతం లోక్‌సభ సభ్యునిగా కొనసాగుతున్నారు.

శ్రీ చంద్రశేఖర్‌రావు, శ్రీ మన్మోహన్‌సింగ్ కేంద్ర మంత్రివర్గంలో 2004, మే 22న నౌకాయాన మంత్రిగా, తరువాత జరిగిన మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణంలో 2004, నవంబరు 22 నుండి కార్మిక శాఖ మంత్రిగా పని చేస్తున్నారు.

## శ్రీ కల్వకుంట చంద్రశేఖర్‌రావుగారు డిప్యూటీ స్పీకరుగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

ఈ 11వ శాసన సభకు ఉపసభాపతిగా ఎంపిక చేయడానికి నా పేరును ప్రతిపాదించిన గౌరవనీయులు నారా చంద్రబాబునాయుడుగారికి నేను హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేసుకుంటు న్నాను. గౌరవ ప్రతిపక్ష నాయకులు కేంద్రంలో గల సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, మన రాష్ట్రంలో కూడా ప్రతిపక్షానికి డెప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలని కోరినప్పుడు, మన రాష్ట్రంలో ఆ సాంప్రదాయం లేనందువల్ల ఈ రకమైన పరిణామం వస్తే, నా పేరును ప్రతిపాదించి నప్పుడు, వారు కూడా సహకరించి, వారి అభ్యర్థిని పోటీ పెట్టకుండా సహకరించినందుకు వై.ఎస్. రాజశేఖరరెడ్డిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. బి.జె.పి. నాయకులు గౌరవ ఇంద్రసేనారెడ్డిగారికి, ఎం.ఐ.ఎం. నాయకులు సజ్జాద్‌గారికి, సి.పి.ఎం. నాయకులు నర్సింహయ్య గారికి కూడా ధన్యవాదాలు తెలియజేస్తూ నేను ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి నా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. చాలమంది గౌరవ మంత్రులు, సీనియర్ శాసనసభ్యులు, వివిధ పక్షాల నాయకులు అందరూ కూడా నేను ఈ పదవికి ఎన్నికయినందుకు అభినందనలు తెలియచేసినందుకు వారికి పేరు పేరున ప్రతి ఒక్కరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. అభినందనలు తెలియచేసే క్రమంలో కొందరు సభ్యులు కొన్ని సూచనలు చేశారు. ఒకసారి స్పీకర్, డెప్యూటీ స్పీకర్ స్థానాలకు ఎంపిక అయిన తరువాత నిష్పక్షపాతంగా, ప్రజోపయోగకరమైన ఫలవంతమైన చర్చలు ఈ సభలో చోటుచేసుకునే అందరికి అవకాశాలు లభించే విధంగా ప్రవర్తించడం ఉదాత్తంగా ఉంటుందని నా వ్యక్తిగత అభిప్రాయం. అందుకోసం కొత్తగా వచ్చిన శాసనసభ్యులు, మిత్రులు రామకృష్ణారెడ్డిగారు చెప్పారు. నాకు భయంగా ఉంది. ఇక్కడ పరిస్థితి చూస్తుంటే మరొకరకంగా ఉంది అన్నారు. అలాంటి భయాలు కొత్తగా వచ్చిన శాసన సభ్యులకు అవసరంలేదు. సీనియర్ శాసనసభ్యులు ఇచ్చిన స్ఫూర్తితో అన్ని విషయాల్లో అందరికి కూడా అవకాశాలు లభిస్తాయి. అందరూ చర్చించవచ్చు. అటువంటి దానికి ఏమీలేదు. అయితే ఇందాక చాలామంది సభ్యులు, సభానాయకులు తెలియజేసినట్లు నేను గత 15 సంవత్సరాల నుంచి వివిధ స్థానాలలో ఉండడం జరుగుతోంది. నాకుకలిగిన అనుభవాలనుంచి, మనం తీసుకోవలసిన చర్యల గురించి ఒక్కమాట రేఖామాత్రంగా ఇప్పుడు ప్రస్తావించదలచు కున్నాను.

నూతన సహస్రాబ్దిలోకి ప్రపంచ మానవాళి అడుగిడబోతున్న ఈ తరుణంలో చట్టసభలు ఎక్కడైతే స్ఫూర్తివంతంగా, ఉపయుక్తమైన చర్చలు చేస్తూ ప్రయోజనకరమైన కార్యక్రమాలకు నెలవులుగా ఎక్కడైతే ఉంటాయో అక్కడ ఆయా సమాజాలు అద్భుతమైన అభివృద్ధి కార్యక్రమాలను, ఫలితాలను ఆవిష్కరించుకుంటున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతి ప్రజా ప్రతినిధి ఏ స్థాయిలో ఉన్న వ్యక్తి అయినా అధికారపక్షం వారైనా, ప్రతిపక్షంవారైనా ప్రజాస్వామ్యం యొక్క అంతిమ లక్ష్యం 'ప్రమోషన్ ఆఫ్ హ్యూమన్ వాల్యూస్' 'ఉన్నత మానవ విలువల సాధన' ఏకైక లక్ష్యం. కాబట్టి ప్రతి ఒక్కరు కూడ ఈ ప్రజాస్వామ్య సౌధంలో ఉన్నటువంటి వారందరమూ పని చేయగలిగితే తప్పకుండా మనం కూడ అద్భుతమైన ఫలితాలు సాధించగలుగుతాము. ఇక్కడున్న శాసనసభకు మన దేశంలోనే ఒక ప్రత్యేకత ఉంది. చాలా చక్కటి పద్ధతిలో చక్కటి పంథాలో పనిచేసే శాసనసభగా మన రాష్ట్ర శాసనసభకు కీర్తి ప్రతిష్ట ఉంది. ఆ ప్రతిష్టను ఇంకా ఇనుమడింప చేయడానికి, పెంచడానికి మీ అందరి సహకారం తీసుకుని, స్పీకర్‌గారి సహకారం పొంది తప్పకుండా మీరు అప్పగించిన ఈ బాధ్యతను మన రాష్ట్ర శాసనసభ యొక్క గౌరవం ఇనుమడింప చేసే విధంగా నేను కృషిచేస్తానని, నేను మీ అందరి గౌరవాన్ని పొందేవిధంగా ప్రయత్నం కూడ చేస్తానని, మీరు అందరూ కూడా హృదయపూర్వకంగా ఈ రోజు అభినందనలు ఏ విధంగా అందించారో సహకారం కూడ అదేవిధంగా అందించాలని, నా కర్తవ్యాన్ని నిర్వహించేవిధంగా అందరూ సహకరించాలని కోరుతూ నాకు అభినందనలు తెలియజేసినందుకు, ఈ అవకాశం కల్పించినందుకు ప్రతి ఒక్కరికి మరొక్కసారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసు కుంటున్నాను.